క్లుప్తంగా

వైద్యులకు సంఘీభావం



క్రోసూరు: గత పది రోజులుగా సమ్మె చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు సంఘీభావంగా సోమవారం వైద్యసిబ్బంది, ఉద్యోగులు, నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. పలువురు సిబ్బంది మాట్లాడుతూ వైద్యులు చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తీసుకునే సత్వర పరిష్కారంతో రోగులకు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఉద్యోగులు, ల్యాబ్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు పాల్గొన్నారు.

క్రోసూరు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బండారు



క్రోసూరు: క్రోసూరు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బండారు మైసూరుబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. సోమవారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నికలు నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు షేక్ సుభాని, ఎంపీపీ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పద్మావతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రంథాలయ ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ స్థలదాత మన్నెం సాంబశివరావు.. బండారు మైసూరుబాబును పేరును ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎస్ఎం సుభాని, జాయింట్ సెక్రటరీగా మన్నెం సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలిరోజు గ్రంథాలయంలో అత్యవసరంగా అభివృద్ధికి చేయాల్సిన పనులపై చర్చించి ఆమోదించారు.

పశువుల్లో రక్తహీనతను అరికట్టండి

అమరావతి: వర్షాకాలంలో పశువులను ఆశించే దోమలు, నల్లులు, పేలు, గోమార్లు, పిడుదులు పశువుల నుంచి రక్తం పీలుస్తాయని వీటి నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి వెంకట్రామయ్య అన్నారు. సోమవారం ఆయన పశువుల్లో రక్తహీనతకు కారణాలు వివరిస్తూ కీటకాలతో పశువులలో రక్తహీనత ఏర్పడి మరణించే ప్రమాదం ఉందన్నారు. పశువుల్లోనెలకు ఒకసారి వెంట్రుకలు కత్తిరించటం ద్వారా వ్యాధిని కొంతమేర నివారించవచ్చన్నారు.

ట్రాన్స్‌ఫర్ కోరుకున్న టీచర్లను రిలీవ్ చేయండి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ట్రాన్స్‌ఫరైన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.ఎం.సుభాని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు జరగకపోవడంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. నలుగురు ఉన్న పాఠశాలలో ఇద్దరికి, ఇద్దరున్న చోట ఒకరికి, ఒక్కరున్న చోట ఎవరినీ నియమించకపోవడంతో జూన్‌లో ట్రాన్స్‌ఫర్ అయిన ఉపాధ్యాయులు బదిలీ అయిన చోటుకు వెళ్లలేక, ఉన్న చోట రిలీవ్ చేసేవారు లేక గందరగోళానికి గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం అవసరమైన చోట విద్యా వలంటీర్ల నియామకం చేపట్టి ట్రాన్స్‌ఫర్ కోరుకున్న కొత్త స్థానాలకు బదిలీ చేయాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పొగాకు కొనుక్కునేందుకు ఇంటి నుంచి సత్తెనపల్లి వెళ్లి కనిపించకుండా పోయాడంటూ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్తెనపల్లి పట్టణ ఏఎస్సై రమణారావు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముప్పాళ్ళ మండలంలోని దమ్మాలపాడు గ్రామానికి చెందిన విప్పల సుబ్బారెడ్డి ఈ నెల 9వ తేదీన పొగాకు కొనుక్కుంటానంటూ ఆటోలో సత్తెనపల్లి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో పట్టణంలో, పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభించలేదని కుమారుడు విప్పల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నరసరావుపేట రూరల్: ఎంఏఎం కళాశాలలో సోమవారం అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎంవీ రామశేషగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విపత్తు సంభవించినప్పుడు నష్టాన్ని తగ్గించడం, వనరులను సమన్వయం చేసుకోవడం ముఖ్య అంశాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు, వరదలు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి యువత సిద్ధంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ మెన్ పెనుమాక వెంకటేశ్వరరావు, సతీష్ బాబు విద్యార్థులకు తెలియజేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమా..

వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి



సత్తెనపల్లిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సుధీర్‌భార్గవరెడ్డి, నేతలు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సంపద సృష్టించడమంటే కుటీర పరిశ్రమ మాదిరి నకిలీ మద్యం తయారీ చేయడమేనా చంద్రబాబుగారూ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నకిలీ మద్యం అరికట్టి, జరిగిన ఘటనలపై సీబీఐ విచారణ చేయాలని కోరుతూ సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దని హెచ్చరించారు.

అంక్షల నడుమ..

పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి పోలీసుల అంక్షల నడుమ వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళల ర్యాలీ ఎక్సైజ్ స్టేషన్ వరకు సాగింది. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం మాఫియా నడుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వమే నాణ్యమైన మద్యం సరఫరా చేసి పది శాతం ఆదాయాన్ని గడిస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసి నాసి రకం మద్యం సరఫరా చేస్తూ ఆదాయాన్ని మూడు శాతానికి పడిపోయేలా చేశారన్నారు. ఊరూరా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.

కూటమి నేతలదే నకిలీ మద్యం నిర్వహణ

చిత్తూరు, కృష్ణా జిల్లాల్లో బయటపడ్డ నకిలీ మద్యం అంతా కూటమి నాయకులే నిర్వహిస్తున్నారని, ఒక్క దుకాణం పైనా పూర్తి స్థాయిలో విచారణ జరిపింది లేదని ఆరోపించారు. ప్రజలు మద్యం తాగితే ప్రభుత్వానికి కిక్ వస్తుందని చెప్పారు. కూటమి పాలన అధ్వానంగా మారిందన్నారు. ప్రతి తప్పును గత ప్రభుత్వంపై నెట్టివేసే ధోరణిని అవలంబించడం దుర్మార్గమన్నారు. పోలీసుల డిపార్ట్‌మెంట్‌ను వారి చేతిలో ఉంచుకుంటూ భయభ్రాంతులకు గురి చేయటమే తప్ప.. పాలనపై దృష్టి సారించడం లేదన్నారు. పట్టుబడిన నకిలీ మద్యం తయారీ కేంద్రాల్లో రోజుకు రెండు కోట్ల మేర సరుకు తయారవుతుందని, అంటే ఈ పదహారు నెలల్లో సుమారు రూ.15వేల కోట్ల కుంభకోణం జరిగి ఉండవచ్చన్నారు. ఇంత పెద్ద కుంభకోణం ఎక్కడా చూసి ఉండరన్నారు. దొరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సస్పెండ్ చేశామంటే కుదరదన్నారు. సీబీఐ ఎంక్వైయిరీ వేయాలని డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తు అంటూ దాటవేత ధోరణి అవలంబించడం సరి కాదని హితవు పలికారు.

సాక్షి మీడియాపై కక్ష సాధింపునకు దిగుతున్నారు

మద్యం కుంభకోణంపై నిజాలు రాస్తున్న సాక్షి మీడియాపై కేసులు పెడుతూ, దాడులకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ఎటూ వాళ్ల మీడియా నుంచి వాస్తవాలు బయటకు రావని, అన్నీ మూసేస్తున్నారు.. బయటకు తెచ్చిన వారిపై కేసులు పెట్టి మూసేద్దామంటే ఎలా అని ప్రశ్నించారు. మందుపై ఉన్న దృష్టి మంచినీటిపై లేకుండా పోయిందన్నారు. గుంటూరు జిల్లాలో కలుషిత నీరు తాగి రోగాల బారిన పడి చనిపోయిన ఉదంతాలు ఉన్నాయని, ప్రస్తుతం పల్నాడు జిల్లాలోను వెలుగు చూశాయన్నారు. ప్రభుత్వ పెద్దలు కల్తీ మద్యం నివారణకు క్యూఆర్‌కోడ్ అంటూ విచిత్రధోరణిని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కారకులపై చర్యలు తీసుకోండి

నిల్వలను గుర్తించి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యంపై సిట్‌కు బదులు సీబీఐ విచారణ చేయించాలన్నారు.

న్యాయపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రజలు కల్తీ మద్యాన్ని గుర్తిస్తే ప్రొహిబిషన్ శాఖ దృష్టికి తీసుకొచ్చినట్లయితే మరొకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి, నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గంగవరపు అనూష, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, సత్తెనపల్లి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొణతం స్వాతి, మహిళా విభాగం నాయకురాలు యర్రం లక్ష్మి, రాయిడి విజయ, వేల్పుల శ్రీదేవి, హేమలత, రాష్ట్ర నాయకులు పక్కాల సూరిబాబు, చిట్టా విజయ భాస్కరరెడ్డి, సాంబశివరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీఅచ్యుత శివప్రసాదు, పట్టణ అధ్యక్షుడు సహారా మౌలాలి, మండల కన్వీనర్లు భవనం రాఘవరెడ్డి(నకరికల్లు), వేపూరి శ్రీనివాసరావు(రాజుపాలెం), నక్కా శ్రీనివాసరావు(ముప్పాళ్ళ), రాయపాటి పురుషోత్తమరావు(సత్తెనపల్లి), జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఇందూరి నరసింహారెడ్డి, మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజీఎం రామలింగారెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి చిలక జయపాల్, యాసారపు బాబు, దివ్యాంగుల విభాగం నాయకులు గోరా, కమల్‌బాషా, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, కానాల పుల్లారెడ్డి, లీగల్‌సెల్ నాయకులు మణిబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో అప్రమత్తం



రాజుపాలెం: బాణసంచా విక్రయాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి షాపు యజమానులకు సూచించారు. బాణసంచా విక్రయాల విషయంలో 'ఎలా అనుమతిచ్చారు' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కొండమోడు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయకేంద్రాలను సత్తెనపల్లి ఆర్డీవో సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కనకదుర్గా బాణసంచా విక్రయకేంద్రం, త్రికోటేశ్వర బాణసంచా విక్రయకేంద్రాన్ని, కోటనెమలిపురి సమీపంలో ఏర్పాటు చేసిన శివకాశి బాణసంచా విక్రయకేంద్రాలను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లను, ప్రభుత్వ అనుమతి పత్రాలను పరిశీలించారు. శివకాశి బాణసంచా విక్రయకేంద్రంలో స్టాకు రిజిస్టర్‌కు, తెచ్చిన స్టాక్‌కు వ్యత్యాసం ఉండటంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వెంట తహసీల్దార్ సరోజ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, వీఆర్వో శ్రీవాణి, ఉన్నారు.

క్రోసూరుకు 22 మంది ఉపాధ్యాయులు

క్రోసూరు: ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల్లో క్రోసూరు మండలానికి 22 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ కేటాయించినట్లు ఎంఈఓలు జి.కృష్ణ, ఎం.గణేష్ సోమవారం తెలిపారు. 22 ఉపాధ్యాయ పోస్టుల్లో ఒకటి మాత్రమే ఎస్జీటీ పోస్టు హసనాబాద్ ఎంపీయూపీ పాఠశాలకు కేటాయించగా మిగతా 21 ఉపాధ్యాయుల పోస్టులు స్కూల్ అసిస్టెంట్ అని వివరించారు. వీరిలో ఆరుగురిని దొడ్లేరు జెడ్పీ పాఠశాలకు కేటాయించగా, ఐదుగురిని హసనాబాద్ జెడ్పీకి, క్రోసూరు జెడ్పీకి ఇద్దరు, గుడిపాడు జెడ్పీకి ముగ్గురు, 88త్యాళ్లూరు జెడ్పీకి ఇద్దరు, నాగవరం జెడ్పీకి ఒకరిని, అనంతవరం ఎంపీయూపీకి ఒకరిని, ఉయ్యందన ఎంపీయూపీకి ఒకరిని కేటాయించినట్లు తెలిపారు. వీరందరూ వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి



నకిలీ మద్యం అరికట్టాలంటూ , సీబీఐ దర్యాప్తు చేయాలంటూ క్రోసూరు అమరావతి బస్టాండ్ సెంటర్ నుంచి వైఎస్సార్ సీపీ నేతల ర్యాలీ

క్రోసూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదేశాలతో సోమవారం క్రోసూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కల్తీమద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ, సీబీఐ దర్యాప్తు కోరుతూ ర్యాలీ, నిరసన, చేపట్టి ఎక్సైజ్ సీఐ టి.తులసికి వినతి పత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతుందన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా రాజ్యం మేలుతూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమలాగా మార్చి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యంతో ప్రజలు ప్రాణాలు తీస్తున్న కూటమి వైఖరికి, ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాడుతున్నామన్నారు. మహిళా నేత, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలా, పార్టీ నాయకురాలు అనంతలక్ష్మితో కలిసి పార్టీ నాయకులు ఎక్సైజ్ సీఐ టి.తులసికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి , కొండవీటి కోటేశ్వరావు, క్రోసూరు మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షుడు చిలకా చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ చిలకా పెదబాబు, అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, రోశిరెడ్డి, నాయుడు రాంబాబు, దుగ్గి కొండలు, పాశం శ్రీనివాసరెడ్డి, షేక్ గఫూర్, నెల్లూరి చంద్రబాబు, పెద కూరపాడు నియోజకవర్గ, మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో జన్యులోపాలు గుర్తించాలి



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ స్వర్ణరాజేశ్వరి

అచ్చంపేట: అన్ని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు స్క్రీనింగ్ సర్వే చేసి పుట్టుకతో వచ్చే జన్యులోపాలు, 4డీ సంబంధిత వ్యాధులను గుర్తించి, అటువంటి వారిని గుంటూరు డైస్ (డీఐఈఎస్)సెంటర్‌కు పంపి అవసరమైన శస్త్ర చికిత్సలు అందేలా చూడాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ స్వర్ణ రాజేశ్వరి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న బాలస్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) స్క్రీనింగ్ సర్వే ప్రగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య ఉపకేంద్ర సిబ్బందిని ఒక్కొక్కరిగా పిలిచి సర్వే చేయడంలో జాప్యంపై ఆరా తీశారు. ఆలస్యానికి సాకులు చెప్పొద్దని ప్రతి ఒక్కరూ నెలాఖరుకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారి సాయితేజారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కె కరీముల్లా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

పన్నులతో సామాన్యులపై పెనుభారం



మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, నేతలు

నకరికల్లు: పన్నులతో సామాన్యులపై పెనుభారం పడుతున్నా కేంద్రం, కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మండిపడ్డారు. అమెరికా నిరంకుశ పన్నుల విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో నకరికల్లులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో సోమవారం అధ్యయన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ నుంచి దిగుమతయ్యే దుస్తులు, రొయ్యలు, చేపలు, సముద్ర ఉత్పత్తులు, లెదర్, వజ్రాభరణాలపై ట్రంప్ ప్రభుత్వం సుంకాలు పెంచిందన్నారు. దేశంలోని అన్నిరంగాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ట్రంప్ విధిస్తున్న పనులపై కేంద్రప్రభుత్వం ద్వంద్వ వైఖరితో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీతో సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, సీపీఎం నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, జి.పిచ్చారావు, చట్టు కోటేశ్వరరావు, కొండానాయక్, మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల, ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు దరియావలి, పలుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొరవడుతున్న పారిశుద్ధ్యం



మాదల ప్రధాన కూడలిలో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

- మాదలలో రోడ్లు మురుగు తటాకాలే
- పాఠశాల ఆవరణలో నీటి మడుగులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో పారిశుద్ధ్యం కొరవడింది. దీంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. కాల్వలు మురుగుతో నిండటంతో నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తూ, గుంతల్లో నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మంచినీటి పైపులు కూడా కాల్వల వెంటే ఉండటంతో నీరు కలుషితమై రోగాలు ప్రబలే అవకాశం ఉంది. గ్రామంలో ఎస్సీ కాలనీలోని అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ వర్షం నీటితో నిండి చిన్నపాటి తటాకంగా కనిపిస్తోంది. గుంతల్లో నిలిచిన నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెలియాయిడోసిస్ కలకలంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగముందే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



వర్షం నీటితో తటాకంగా మాదల ఎస్సీ కాలనీలోని పాఠశాల ఆవరణ

ఎరువులతో జీవ వైవిధ్యం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): పంటలపై జీవన ఎరువుల వాడకంతో సమగ్రపోషక యాజమాన్యం పాటించి జీవ వైవిధ్యాన్ని పెంపొందించవచ్చని ఏరువాక కేంద్రం పల్నాడు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెంలో జీవన ఎరువుల వారోత్సవాల్లో భాగంగా రైతులకు జీవన ఎరువుల వాడకంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నగేష్ మాట్లాడుతూ అజోస్పైరిల్లమ్, ఫాస్ఫోబ్యాక్టీరియమ్ వంటి జీవన ఎరువులు గాలిలోని నత్రజనిని స్థిరీకరించడం, భూమిలో ఉన్న భాస్వరాన్ని, పొటాషియాన్ని మొక్కకు అందుబాటులోకి తేవడంతో పాటు నీటి లభ్యతను పెంపొందిస్తుందన్నారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా తయారయ్యే జీవన ఎరువులను రైతులు పొలాల్లో వినియోగించి సమగ్ర పోషక యాజమాన్యాన్ని పాటించి మంచి దిగుబడులతో అధిక ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త పి.వి.సత్యగోపాల్, గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకం విద్యార్థినులు పాల్గొన్నారు.

నూతలపాటికి అభినయ జీవిత సాఫల్య పురస్కారం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ప్రగతి కళామండలి అధ్యక్షులు, నటులు, దర్శకులు, కవి, 40కి పైగా నాటకపరిషత్‌లు నిర్వహించిన నూతలపాటి సాంబయ్య అభినయ జీవిత సాఫల్య పురస్కారం అవార్డుకు ఎంపికైనట్లు అభినయ అధ్యక్షులు శ్రీనివాస్, ట్రస్టీ గుంటుపల్లి కృష్ణారావు సోమవారం తెలిపారు. అక్టోబర్ 15,16,17 తేదీల్లో గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న నాటకోత్సవంలో అవార్డు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



వినుకొండ: ఇటీవల విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ క్రికెట్ సెలెక్షన్స్‌లో చీకటిగలపాలెం లోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ చదువుతున్న పల్లెపోగు ఆకాశ్, అమృతపూడి మహేష్‌బాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 క్రికెట్ టీమ్‌కి ఎంపికయ్యారని తెలిపారు. నరసరావుపేట డివిజనల్ స్థాయి చెస్‌లో కె.చతురాసాయి, యువ అనంతేష్, కబడ్డీలో కమతం సుకన్య ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీ చిన్న పాపారావు, ఇన్‌చార్జి ఖాశీం పీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులందించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కౌలు సంఘం నాయకులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై కౌలురైతు సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు రైతు చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పాత కౌలుదారీ చట్టంలో లోపాలు ఉన్నాయని, సవరించి భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించి 18నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. కౌలు రైతులు ధనికుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని, ప్రభుత్వం అన్నదాత సుఖీభవను అందించి ఆదుకోవాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఆందోళన చేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, మండల అధ్యక్షులు చలువాది లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు మక్కపాటి నరసింహారావు, పూర్ణయ్య, రైతులు వల్ల దాసు, బుల్లయ్య పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థిక భరోసా



పశుపోషణపై మహిళలకు అవగాహన కలిగిస్తున్న వెటర్నరీ ఏడీఏ వెంకటేశ్వర్లునాయక్

నకరికల్లు: పశుపోషణతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని వెటర్నరీ ఏడీఏ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మేలుజాతి పశువుల ఎంపిక, పశుపోషణ తదితర అంశాలపై అవగాహన సదస్సును మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువుల పోషణతో మహిళలకు ఆర్థికభరోసా లభిస్తుందన్నారు. గేదె ఎదకు వచ్చినపుడు లక్షణాలను గుర్తించి చూడి పరీక్షలు చేయించి తగిన వైద్యం చేయించాలన్నారు. పెయ్యదూడలే పుట్టేవిధంగా ఎస్ఎస్ఎస్ సెమెన్ ప్రయోజనాలు వివరించారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసాల పెంపకం, మినీగోకులం షెడ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం జె.సమాధానం, మండలసమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సీసీ కనకారావు, వెటర్నరీ డాక్టర్‌లు ఎ.సాయిమహేష్‌రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

నాదెండ్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అంశంపై పంచాయతీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శులు తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించి సహకరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్, నాదెండ్ల పంచాయతీ కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పంచాయతీ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, దోమల నియంత్రణపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహనకు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.